క్లుప్తంగా

సన్మానం



నరేంద్ర స్వామి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సామవేద పండితుడు నరేంద్ర స్వామి దంపతులకు సోమవారం ఆలయ కార్యవర్గ కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సర్ సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రుద్రాక్ష వైభవ ఆధ్యాత్మిక పీఠం వారు నిర్వహించిన ఓ కార్యక్రమంలో నరేంద్ర శర్మకు సామవేద శిఖామణి కంకణం బహూకరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ఈఓ శ్రీనివాసులు నరేంద్ర స్వామి దంపతులను ఘనంగా సన్మానించారు.

గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో సోమవారం ఓ గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన భూమిరెడ్డి నారాయణరెడ్డి తన పశువుల మేత కోసం ఇటీవలే రూ.50 వేలు వెచ్చించి గడ్డి కొనుగోలు చేసి పొలం సమీపంలో గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. అయితే నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ కె.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ.35 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

వాహనాల తనిఖీ

రాజుపాళెం : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల అధికారులు తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ క్రమంలో రాజుపాళెంలోని మండల కాంప్లెక్సుకు వెళ్లే దారిలో ప్రొద్దుటూరు–ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి షాకీర్ అలీఖాన్, పోలీసు సిబ్బంది వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా నగదు, బహుమతులు అందజేసేందుకు తరలిస్తారనే నేపథ్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. నగదు, మరే ఇతర వస్తువులు లభించినా బిల్లులు చూపించాలని లేనిపక్షంలో సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

నేటి నుంచి మొల్ల జయంతి ఉత్సవాలు

గోపవరం : మహాకవయిత్రి మొల్లమాంబ జన్మస్థలి గోపవరం గ్రామంలో మంగళవారం మొల్ల జయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా ఏడు రోజుల పాటు ఈ సభలు జరుగుతాయన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు గోపవరంలోని ఏపీ హరిత రెస్టారెంట్ ఆవరణలో ఉన్న మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం రామాలయంలో జయంతి ఉత్సవాల సందర్భంగా సభ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కడపకు చెందిన రచయితలు రాఘవరాజుపట్టాభిరామ రాజు, స్వర్ణలత దంపతులకు మొల్ల పేరుతో సాహితీసేవ పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని తులసి సేవా సంఘం అధ్యక్షురాలు తులసి పేర్కొన్నారు. మండల పరిధి ఉప్పొంగలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 75 మంది చిన్నారులకు సోమవారం పలకలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగాచదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు అనురాధ, కవిత, లక్ష్మీ, సుబ్బరాయుడు, రవి పాల్గొన్నారు.

అనధికారిక భూ కేటాయింపులు అరికట్టాలి

కలసపాడు : అనధికారిక భూ కేటాయింపులను అరికట్టాలని సీపీఐ మండల కార్యదర్శి జాకోబ్ సోమవారం డిప్యూటీ తహసీల్దారు మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అసైన్‌మెంట్ కమిటీ జరిపి పేద, బడుగు, బలహీన వర్గాలకు సమగ్ర భూ పంపిణీ చేపట్టాలని కోరారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన భూ పంపిణీలో అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు విధిగా నిర్వహించి ఎమ్మెల్యే నేతృత్వంలో ఆర్డీఓ, తహసీల్దారు, గుర్తింపు పొందిన రాజకీయా పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి అర్హులైన పేదలకు రెండు ఎకరాలు సాగు భూమిని పంపిణీ చేశారన్నారు. గత 12 సంవత్సరాలుగా అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలకే నోచుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలింగార్చన

కలసపాడు : స్థానిక తెల్లపాడు క్రాస్‌రోడ్డులోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో సోమవారం మహాలింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజ, గణపతి పూజ, 500 శివలింగాలకు అభిషేకం, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి అభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, చండీపారాయణం తదితర పూజా కార్యక్రమాలు బ్రహ్మశ్రీ వారణాసి వెంకటరమణయ్య వారి బ్రహ్మత్వమున నిర్వహించారు. వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



మహాలింగార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న వేద పండితులు

విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించాలి

విద్యాసంస్థల్లో ఎమ్మెల్యే రాచమల్లు విస్తృత ప్రచారం

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను గురువులందరూ గుర్తించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలోని పలు విద్యాసంస్థలకు వెళ్లి సోమవారం ఎమ్మెల్యే ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు చోట్ల మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం తీసుకోని విధంగా విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. గతంలో ప్రభుత్వాలు పాఠశాలలకు సున్నం కూడా వేసే పరిస్థితి లేదని, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు రంగులతో కళకళలాడుతున్నాయన్నారు. సమాజంలో గురువులకు మాత్రమే ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీలు, రామేశ్వరం, వసంతపేట, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, నడింపల్లెలోని ఎస్‌బీ మెమోరియల్ పాఠశాలలో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, బీఎస్‌ఆర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డితో పాటు ఆయా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ తరఫున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాం రెడ్డి ప్రచారం చేశారు. సోమవారం డీసీసీబీలో బ్యాంకు ఉద్యోగులను ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈనెల 13న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుని జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు.

పార్కు గ్రంథాలయం అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు కల్చరల్ : మున్సిపల్ పార్కులో ఉన్న గౌరుతిరుపతి రెడ్డి గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పేర్కొన్నారు. సోమవారం దివంగత న్యాయవాది ఉదయకుమార్ సతీమణి సరోజా ఉదయకుమార్ గ్రంథాలయానికి అవసరమైన బీరువా, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయానికి అవసరమైన వాటిని అందివ్వడం పట్ల అభినందనలు తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి మేరకు పనివేళలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు మార్చుతామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, స్పెషల్ ఆఫీసరు సుభాషిణి, సాదు గోపాలకృష్ణ, డాక్టర్ చిన్నలక్ష్మి కళావతి, చంద్రశేఖరరావు, కాశీవరపు వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీని కాపాడుకుందాం

ప్రొద్దుటూరు క్రైం : అదాని చేతుల్లో నుంచి ఎల్ఐసీ సంస్థను కాపాడుకుందామని జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తెలిపారు. ప్రొద్దుటూరులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఎల్ఐసీ పెట్టుబడులను అదానికి చెందిన గ్రూపుల్లో పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రాహుల్‌గాంధీ సైతం పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తినా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్‌లైనా లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు సీ జిలానీబాషా, నాయకులు భాస్కర్, రామాంజనేయులు, సైమన్, ఖాజాపీర్, మహిళా అధ్యక్షురాలు లీలారాణి పాల్గొన్నారు.

విద్యార్థినులు క్రమశిక్షణతో చదవాలి

దువ్వూరు : విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రిటైర్డు ఎంఈఓ దండు చెండ్రాయుడు తెలిపారు. మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా చదివి క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఒంటేరుకు పీటీఎల్‌యూ మద్దతు

ప్రొద్దుటూరు కల్చరల్ : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంఘం (పీటీఎల్‌యూ) మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డిని వారు కలిసి మద్దతు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎందరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు మారినా తమ గోడు పట్టించుకునే వారే లేరని పేర్కొన్నారు. పోరాట పటిమగల ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి తమ మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. అధ్యాపకుల సంక్షేమం కోసం ఒంటేరు ఎన్నో పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించారని తెలిపారు. ప్రైవేటు ఉపాధ్యాయుల జీవితాలకు భరోసా దక్కాలన్నా, వారి కష్టాలను గట్టెక్కాలన్నా ఒంటేరు శ్రీనివాసులరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ విశ్రాంత సెక్రటరీ కేశవరెడ్డి, శ్రీనివాసులు, నరేంద్రనాథ్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి మద్దతు పత్రాన్ని ఇస్తున్న పీటీఎల్‌యూ నాయకులు

రంజాన్ కోసం కోసం 23 మందితో కమిటీ ఏర్పాటు

ప్రొద్దుటూరు : పట్టణంలోని ప్రముఖమైన జామియా మసీదు నిర్వహణకు సంబంధించి రంజాన్ సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు 23 మంది మైనారిటీ నాయకులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి తెలిపారు.

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ రంజాన్ పండుగ కంటే ముందుగా మంగళవారం రాత్రి పెద్దల పండుగ జరుగుతుందన్నారు. రంజాన్ నెలలో తమకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఇటీవల ముస్లిం మైనారిటీ నాయకులు కోరారని తెలిపారు. ప్రస్తుతం జామియా మసీదు వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉండటంతో నిర్వహణకు ఇబ్బంది ఏర్పడుతున్నదన్నారు. అందులో భాగంగానే తాత్కాలికంగా 23 మంది యువకులతో కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. రంజాన్ సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చేయడం, తాగునీరు, లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు పరిసరాలను, ఖబరస్తాన్‌ను శుభ్రంగా ఉంచడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కమిటీలో కరీముల్లా, హాజీపీరా, జబీర్, ఫిరోజ్, హిదాయత్, సుభాన్ బాషా, వల్ల దాదాపీర్, ఇక్బాల్, గౌస్ మోద్దీన్, నూరి, క్లాసిక్ జాఫర్, రఫిక్, మున్నా, అస్లాం తదితరులు ఉన్నారు.

11న ఉచిత మెగా మెడికల్ క్యాంప్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఐఎంఏ హాల్‌లో ఈ నెల 11న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు కొవ్వూరు రమేష్‌రెడ్డి చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు కొవ్వూరు రమేష్ రెడ్డి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అనారోగ్యం బారిన పడటంతో 2003 మార్చి 11న లివర్ ట్రాన్స్‌ప్లాంట్ జరిగిందని, ఇప్పటికి 21 ఏళ్లు అయిందన్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన వరంగల్ జిల్లా పాలంపేటకు చెందిన స్వప్న అనే అమ్మాయి తనకు లివర్ ఇచ్చిందన్నారు. ఆమె కుటుంబానికి తాను రుణపడి ఉన్నానన్నారు. సొసైటీ ద్వారా పేదలకు వడ్డీలేని రుణాలు, మెడికల్ క్యాంప్‌లు, పేదలకు కుట్టుమిషన్లు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. ఈనెల 11న మెగా మెడికల్ క్యాంప్‌ను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ హెపటాలజిస్ట్ డాక్టర్ ధర్మేష్ కపూర్, అసోసియేట్ కన్సల్టెంట్ హెపటాలజిస్ట్ డాక్టర్ వైవీ.భార్గవ్, ప్రియభావన హాస్పిటల్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల నిపుణుడు డాక్టర్ హరిప్రియ వైద్యసేవలు అందిస్తారన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 9247840240, 9177500399 నంబరుకు సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న కొవ్వూరు రమేష్‌రెడ్డి

స్పందనకు అధిక ప్రాధాన్యత

గోపవరం : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి వారు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం వారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలైనా స్పందన కార్యక్రమంలో అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్నిశాఖల అధికారులు ఒకేచోట స్పందనలో పాల్గొంటున్నందున ప్రజలకు సులభతరంగా మారిందన్నారు. సచివాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నందున ఆయా గ్రామాల ప్రజలు అక్కడ కూడా అర్జీలు ఇచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పోరుమామిళ్ల : గురవ్వగారిపల్లె ఎంపీపీ పాఠశాలలో సోమవారం గ్రామానికి చెందిన నాగిరెడ్డి అంబరేశ్వరరెడ్డి తన తల్లిదండ్రుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందచేశారు.

నీటి సమస్య లేకుండా చర్యలు

పోరుమామిళ్ల : వేసవిలో పట్టణ ప్రజలకు మంచి నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ సుధాకర్ తెలిపారు. సోమవారం జరిగిన పంచాయతీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పుల్లివీడు నుండి పోరుమామిళ్లకు వేసిన మంచినీటి పైపులు తొలగించి నందున తెలుగుగంగ బంగ్లా వద్దనే బోరు వేసి, అక్కడి ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు అందిస్తామన్నారు. చెన్నవరం నుండి పట్టణానికి వేసిన పైప్‌లైన్ ద్వారా నీరు అందనందున తగిన చర్యలు తీసుకునేందుకు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తామన్నారు. పట్టణంలో డ్రైనేజీ పనులు జరుగుతున్నందున పైప్‌లైన్ పగిలిపోయి 3 వీధులకు నీరు అందడం లేదన్నారు. వారికి ఇబ్బంది లేకుండా ట్యాంకుల ద్వారా నీరు అందిస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణలో మందబావి పంచాయతీ రూములు తొలగిస్తారని, అందువల్ల పంచాయతీకి ఆదాయం పోతుందన్నారు. వెనుక ఉన్న పాఠశాల స్థలం పంచాయతీకి ఇస్తే అక్కడ రూములు నిర్మించి తిరిగి ఆదాయం సమకూర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి, సీనియర్ అసిస్టెంట్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోండి

గోపవరం : రైతుభరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోపవరం రైతుభరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరంగా రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు వాట్సాప్ గ్రూపును అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు పంటల సాగు తీసుకోవాల్సిన సస్యరక్షణపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే రైతులు కూడా ఈ గ్రూపు ద్వారా అధికారులకు తెలియజేసి సలహాలు పొందవచ్చన్నారు. అనంతరం రబీలో సాగైన పంటలకు సంబంధించి ఈ–పంట నమోదు, పీఎం కిసాన్, రైతుభరోసాలకు సంబంధించి వ్యవసాయ సిబ్బంది ద్వారా ఆరా తీశారు. ఇంకా అర్హత ఉండి రైతులకు పీఎం కిసాన్, రైతుభరోసా అందని వారు ఉంటే వారి వివరాలను సేకరించాలన్నారు. రైతులు కూడా ఆర్బీకేలకు వెళ్లి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, వీఏఏ విజయ్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయపరంగా వాట్సాప్‌ను మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయిస్తున్న ఏడీఏ నాగరాజ

జార్జి కారోనేషన్ క్లబ్ కొత్త కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు క్రైం : జార్జి కారోనేషన్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్ బాలగంగిరెడ్డి, సెక్రటరిగా ఎల్ గంగిరెడ్డి, జాయింట్ సెక్రటరిగా వీవీ శివారెడ్డిలు ఎన్నికయ్యారు. అలాగే ఈసీ మెంబర్లుగా వై చంద్రశేఖర్‌రెడ్డి, హరిఓబుళరెడ్డి, ఎం కొండారెడ్డి, బి ఓబులేసు, ఏ రాఘవేంద్ర, కే రాజశేఖర్‌రెడ్డి, కే రాజసింహ, ఎస్ శంకర్‌రావు, ఎన్ శివచంద్రారెడ్డిలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని క్లబ్ సభ్యులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి

బద్వేలు అర్బన్ : ఈనెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిల గెలుపునకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బద్వేలు మున్సిపాలిటీ, రూరల్, గోపవరం, అట్లూరు మండలాల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయాల వారీగా ప్రతి ఓటరును కలిసి ఓటు అభ్యర్థించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా మండలాల వారీగా, సచివాలయాల వారీగా పలువురికి బాధ్యతలు అప్పగించి ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు కష్టపడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్ రామిరెడ్డి, అల్లాబకాష్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు అందూరు రామకృష్ణారెడ్డి, కొండుశేఖర్‌రెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రెడ్డెయ్య, పుల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మిదేవి శ్రీరాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

సమష్టికృషితోనే అత్యధిక మెజారిటీ

బద్వేలు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ప్రణాళిక విషయమై పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు మండల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిమాట్లారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో లక్షలాది మంది ఉద్యోగాలు ఇచ్చారని యువత పార్టీ, జగనన్నపై అభిమానంతో ఉన్నారని, వారందరినీ కలసి పార్టీ అభ్యర్థులకు ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలోపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, పోరుమామిళ్ల, బి.కోడూరు జెడ్పీటీసీలు ముత్యాల ప్రసాద్, దావీద్, పోరుమామిళ్ల పార్టీ మండల కన్వీనర్ సీ బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుదర్శన్, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల జేసీఎస్ నాయకులు గుండం హనుమంతరెడ్డి, కల్లూరు రమణారెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరు: పట్టభద్రునికి నమూనా బ్యాలెట్ ఇస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..

బ్రహ్మంగారిమఠం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం బ్రహ్మంగారిమఠంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 890 పట్టభద్రుల, 90 ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయన్నారు. 11 గ్రామ పంచాయతీల పరిధిలో అయా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు కలసి ఓటర్లను సంప్రదించి ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి గెలుపు కోసం సోమవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రచారం నిర్వహించారు. మండలంలోని వనిపెంటలో ఆయన పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నమూనా బ్యాలెట పత్రాలను పట్టభద్రులకు అందించి రవీంద్రారెడ్డి పేరుకు ఎదురుగా (1) వేయాలని వేయాలని సూచించారు.

'వెన్నపూస'ను గెలిపించండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం మండలంలోని వనిపెంట, తిప్పిరెడ్డిపల్లె, ఆదిరెడ్డిపల్లె పంచాయతీల్లోని పట్టభద్రులను కలసి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. జెడ్పీటీసీ ఏవీ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.నరసింహారెడ్డి, బండి నాగేంద్ర ప్రసాద్, సర్పంచ్ గౌస్ లాజం, ఇడగొట్టు శేషు, కలాం, ఎంపీటీసీ ఇర్షాద్, రామశివారెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు.

పట్టణంలో...

మైదుకూరు పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, దండు కళావతి ప్రచారం చేశారు.

చాపాడులో..

చాపాడు : పట్టభద్రుల ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ తెలిదెల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఖాదర్‌పల్లెలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రుల ఇంటి వద్దకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి మొదటి ప్రాధాన్యతను వేయాలని ఓటర్లను కోరారు.